www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 28 డిసెంబర్ 2025

5

ఏలూరు



31న సామాజిక పింఛన్ల పంపిణీ

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను జనవరి ఒకటో తేదీన కాకుండా ఒక రోజు ముందుగానే డిసెంబర్ 31న పంపిణీ చేయాలని ఆదేశించిందని, ఆ మేరకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 31వ తేదీ ఉదయం ఏడు గంటల నుండి పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లాలో జనవరి, 2,59,151 మంది ఫించన్‌దారులకు రూ.113.68 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 31వ తేదీనే నూరుశాతం పంపిణీకి కృషి చేస్తామని, ఏదైనా అనివార్య కారణాల వల్ల పొందలేని వారు జనవరి రెండో తేదీన తీసుకోవాలని కోరారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ పీడీని కలెక్టర్ ఆదేశించారు.

పోలవరం జిల్లాపై

మొండిగా ముందుకు..!

- ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోని పరిస్థితి
- పోలవరం జిల్లాలో 'పోలవరం' కలపాలన్న వినతులు బుట్టదాఖలు
- కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ఊసే కరువు
- అభ్యంతరాలపై సిఎం సమీక్ష పూర్తి
- 31న తుది నోఫికేషన్‌కు రంగం సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం జిల్లా ఏర్పాటులో ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్నట్లు కన్పిస్తోంది. పోలవరం నియోజకవర్గాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న పోలవరం జిల్లాలో కలపాలని నెల రోజులుగా ప్రజలు చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని పరిస్థితి నెలకొంది. ప్రాథమిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగానే పోలవరం నియోజకవర్గం లేకుండా రంపచోడవరం జిల్లా కేంద్రంగా చింతూరు డివిజన్‌తో కలిపి పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 27న జిల్లాలకు సంబంధించిన మార్పులు, కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. నెల రోజులపాటు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించింది. ప్రజల అభ్యంతరాలపై శనివారం సిఎం చంద్రబాబు మంత్రులతో కలిసి సమీక్షించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు ఏర్పాటు చేస్తున్న పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని జిల్లాలోని ఏజెన్సీ ప్రజలంతా గట్టిగా కోరుతూ నెల రోజులుగా అనేక ఆందోళనలు సైతం నిర్వహించారు. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సైతం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు బాధిత నిర్వాసితులు అత్యధికంగా పోలవరం నియోజకవర్గంలోని కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, కొయ్యలగూడెం మండలాల్లో ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తున్నప్పుడు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలను కలపాలని ఇక్కడి ప్రజలంతా కోరుతూ వచ్చారు. ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌లో తమకు అనకూలంగా నిర్ణయం తీసుకుంటుందని గిరిజనులంతా ఎంతగానో ఎదురుచూశారు. ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. పోలవరం లేని పోలవరం జిల్లాను ఏర్పాటు చేసేందుకు పూనుకుంది. ఏజెన్సీ ప్రాంతాలను కలుపుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని గంగలో కలిపేసినట్లయ్యింది. ప్రభుత్వ తీరును పోలవరం నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు. అభ్యంతరాలపై చర్చలు ముగియడంతో ఈ నెల 31న జిల్లాల మార్పులు, చేర్పులకు సంబంధించిన తుది నోటిఫికేషన్ విడుదల చేయనుంది. దీంతో పోలవరం నియోజవకర్గ ప్రజల ఆశలు కలలుగానే మిగిలిపోనున్నాయి.



పోలవరం జిల్లాలో 'పోలవరం'ను కలపాలని ఏజెన్సీ బంద్ సందర్భంగా బుట్టాయగూడెంలో మానవహారం (ఫైల్‌ఫొటో)

పట్టని కైకలూరు, నూజివీడు నియోజకవర్గ ప్రజల గోడు

తాము అధికారంలోకి వస్తే నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని సిఎం చంద్రబాబు ఎన్నికల సభలో హామీ ఇచ్చారు. దీంతో అక్కడి ప్రజలు తమ కోరిక నెరవేరుతుందని ఆశించారు. కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని రాజకీయ నాయకులు, ప్రజల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తం కావడంతోపాటు వినతులు సైతం ఇచ్చారు. జిల్లాల మార్పులు, చేర్పులు ప్రాథమిక నోటిఫికేషన్‌లో కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ప్రస్తావన లేకుండాపోయింది. దీంతో నెల రోజులుగా ఈ రెండు నియోజకవర్గాల్లో పెద్దఎత్తున నిరసనలు, దీక్షలు సాగుతున్నాయి. అధికారులకు పెద్దఎత్తున వినతులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అభ్యంతరాలపై చర్చల్లోనూ కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ఊసే లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ రెండు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలోనే ఉండనున్నాయి. జిల్లాల మార్పులు, చేర్పులపై ప్రజల అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా ముందుకు సాగడంపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. మరోసారి పునరాలోచించి కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని జనం కోరుతున్నారు.

జీవనాధారం.. నిర్జీవం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం

ఆసరాను కోల్పోయి తల్లడిల్లిన పేద కుటుంబాలు

ప్రజాశక్తి - భీమడోలు

ఆ ముగ్గురు మిత్రులు.. వృత్తిలో భాగంగా ఎక్కడ ఫంక్షన్ జరిగినా ముగ్గురు వెళ్లి ఫ్లవర్ డెకరేషన్ చేస్తుంటారు. రెక్కాడితేగాని డొక్కాడని పేద కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకులు తమ రోజువారీ పనిలో భాగంగా పూలు కోసం ఏలూరు మోటారు సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని విగతజీవులయ్యారు. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబాల జీవనాధారం తెగిపోయినట్లయ్యింది.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుండుగొలను-రాజమండ్రి జాతీయ రహదారిపై సూరప్పగూడెం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మండల కేంద్రమైన ద్వారకాతిరుమలకు చెందిన సయ్యద్ రఫీ (20), కొయ్యగూర శ్రీరామ్ (22), తిమ్మాపురానికి చెందిన మాంద్రాజు చరణ్ (బన్ని) (26) ఫంక్షన్లకు పూల డెకరేషన్ పనులను చేస్తుంటారు. శనివారం తెల్లవారుజామున వీరు ముగ్గురు పల్సర్ మోటార్ సైకిల్‌పై పూల కొనుగోలు కోసం ద్వారకాతిరుమల నుంచి ఏలూరు బయల్దేరారు. సూరప్పగూడెం వద్ద హైవేపైకి చేరే క్రమంలో రాంగ్‌రూట్లో వెళ్తుండగా ఎదురుగా రాజమండ్రి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, భీమడోలు సిఐ ఎంజె విల్సన్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం గాలిస్తున్నట్లు భీమడోలు ఎస్ఐ మదీనాభాషా తెలిపారు. మృతదేహాలకు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు.







జీవనాధారం తెగి తల్లడిల్లుతున్న కుటుంబాలు

రఫీ తల్లి సలీమా కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. రఫీ డెకరేషన్ పనులు చేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో రఫీ మృతితో తల్లి అనాథగా మారింది.

శ్రీరామ్ తండ్రి కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరికి శ్రీరామ్‌తోపాటు ఒక కుమార్తె ఉంది. చేతికి అందొచ్చిన కుమారుని మృతితో ఆ కుటుంబం రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది.

చరణ్ తండ్రి రజక వృత్తిదారు. ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు చరణ్ మృతితో ఆ కుటుంబం భోరున విలపిస్తోంది.

హలో కార్మికా.. చలో విశాఖ

- సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కోరుతూ జోరుగా ప్రచారం
- చింతలపూడిలో ఆకట్టుకున్న 18 మీటర్ల జెండాతో ప్రదర్శన
- భీమవరంలో మోటారు సైకిల్ ర్యాలీని ప్రారంభించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపిమూర్తి
- తణుకులో కరపత్రాలు ఆవిష్కరించిన మాజీ ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు అఖిల భారత 18వ మహాసభను జయప్రదం చేయాలని, జనవరి 4న విశాఖలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నగరంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమైంది. ఈ ర్యాలీని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించిన 55 ఏళ్ల అనంతరం సిఐటియు జాతీయ మహాసభ తొలిసారి మన రాష్ట్రంలో జరుగుతుందన్నారు. లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల హక్కులు పూర్తిగా కాల రాస్తున్నారని, కార్పొరేట్లకు పెద్దపీట వేసి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలన్నీ హోల్‌సేల్‌గా అమ్మేస్తున్నారని, సహజ వనరులు అన్నింటినీ అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. వీటన్నింటిపై మహాసభలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. జనవరి 4వ తేదీ ఆదివారం లక్ష మంది కార్మికులు, ఉద్యోగులు, కష్టజీవులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ విశాఖ మున్సిపల్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఏలూరు జిల్లా నుండి వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు తరలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మంచెల్ల ఇస్సాక్, జి.గోపీ, పంపన రవికుమార్, వివిఎన్.ప్రసాద్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, అంగనవాడీ యూనియన్ నేతలు హైమావతి, గేదెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో..



ఏలూరులో...

చింతలపూడి : సిఐటియు 18వ ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో 18 మీటర్ల జెండాతో ప్రదర్శన నిర్వహించారు. ఎర్రచీరలు, ఎర్ర చొక్కాలతో చేపట్టిన ర్యాలీని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం మాట్లాడారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ మీదుగా మున్సిపల్ ఆఫీస్ వరకు సాగింది. ర్యాలీ అగ్రభాగానే తీన్మార్ డప్పులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ నత్తా వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.పుణ్యవతి మాట్లాడగా నేతలు ఎన్.సరోజిని, జి.సరళాదేవి, కె.కవిత, శ్యామల, అరుణ, చెన్నకేశ్వరి, హేమలత, పాపరత్నం, బి.సరళ, అశ్విని, పుష్పరాణి, వరలక్ష్మి, వంశీ, పద్మ, కృష్ణవేణి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు : సిఐటియు మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు కోరారు. శనివారం పూళ్లలో జనవరి 4న బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను అంగన్వాడీలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు చల్ల మణి, అపర్ణదేవి, స్వర్ణకుమారి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో...



నిడమర్రులో...

నిడమర్రు : సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నిడమర్రు, భువనపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కానూరు రాజు, నేతలు టి.వెంకటలక్ష్మి, కె.జయమ్మ, ఎ.నాగమణి, ఎస్.ధనలక్ష్మి, అనురాధ, త్రివేణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం : సిఐటియు జాతీయ మహాసభ నేపథ్యంలో స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడగా, కార్యక్రమంలో పి.లక్ష్మి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, షేక్ మస్తాన్, బి.పద్మ, ముత్యాలు, ఎం.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భీమవరం : సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీ ఆకట్టుకుంది. తమ మహాసభ సంబరాలను అంబరాన్నంటించేలా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మోటార్ సైకిల్ ర్యాలీని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి ప్రారంభించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, బొంబాయి స్వీట్ సెంటర్, గాంధీచౌక్ జువ్వలపాలెం రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్, ఆర్‌టిసి బస్టాండ్, మావుళ్లమ్మ గుడి వీధి మీదగా తిరిగి సిఐటియు కార్యాలయం వద్దకు చేరింది. ర్యాలీలో మెడికల్ రిప్‌లు, మున్సిపల్, రైస్‌మిల్లు, బజారు జట్టు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపిమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. లేబర్ కోడ్‌ల రద్దు, ఒపిఎస్ అమలయ్యే వరకు పోరాడాలని ఉద్యోగ, కార్మికులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌ల అమలుకు పూనుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, ఎస్.సూర్యచంద్రరావు, కె.వెంకటేశ్వరావు, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

ఇరగవరం : సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో తలపెట్టిన మహాప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు మండలం కన్వీనర్ జుత్తిగ రామాంజనేయులు పిలుపునిచ్చారు.. శనివారం స్థానికంగా బహిరంగ సభ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.వేణుగోపాల్ రావు, ఎం.సత్యవతి, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వీరవాసరం : జనవరి 4న విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానికంగా బహిరంగ సభ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో బొర్రా అలమహారాజు, బాలం విజయకుమార్, యండమూరి సుబ్బారావు, కొత్తల సత్తిబాబు, బొక్కా కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు : కార్మికుల పక్షాన నికరంగా పోరాడే సిఐటియు అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. శనివారం పట్టణంలో సిఐటియు అఖిల భారత మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ 1970 నుండి సిఐటియు కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కార్పొరేట్లకు మేలు చేయడానికి కార్మికులను హింసించడం అన్యాయమన్నారు. పోరాటం ద్వారా సాధించుకున్న హక్కులను హరిస్తే, మళ్లీ పోరాటాల ద్వారా సాధించుకోవడం కార్మికులకు తెలుసని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల కన్వీనర్ గుబ్బల గోపి తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభకు మెడికల్ రిప్స్ విరాళం

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం కావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్ భీమవరం బ్రాంచ్ కమిటీ సిఐటియు జిల్లా కమిటీకి రూ.50 వేలు విరాళాన్ని అందించింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావుకు ఎపిఎంఎస్‌ఆర్‌యు నేతలు చెక్కు అందించారు. ఈ సందర్భంగా వారిని వాసుదేవరావు అభినందించారు. కార్యక్రమంలో ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్రరాజు భీమవరం బ్రాంచి నాయకులు బాలకృష్ణ, రమేష్, పి.రవి పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మెడికల్ రిప్స్ యూనియన్ నేతలు

జీతాల పెంపు కోరుతూ నిరసన

న్యాయం చేయాలని ఆర్‌జియుకెటి అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆవేదన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రతిష్టాత్మక ఐఐటిలు, సెంట్రల్ యూనివర్శిటీల్లో చదువుకుని ఆర్‌జియుకెటిలో 2010-14 సంవత్సరాల మధ్య అసిస్టెంట్ ప్రొఫెసర్లు జీతం పెంచాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు శనివారం మాట్లాడుతూ 2010-14లో చేరిన తమకు ఆరో వేతన సంఘ సిఫార్సుల ఆధారంగా వేతనాన్ని ఫిక్స్ చేశారని తెలిపారు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో కూడా తమకు జీతాలు ఆరో వేతన సవరణ సంఘ సిఫార్సుల ఆధారంగానే పెంచారన్నారు. అప్పటి నుంచి గడచిన ఎనిమిదేళ్లుగా తమకు జీతాలు పెరగలేదన్నారు. అప్పటి నుంచీ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తూనే ఉన్నామని, అయినా ఏ విధమైన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గత మూడు నెలల నుంచి ఈ విషయమై ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. తమకు జీతాలు పెంచే విషయమై 2010-14 సవత్సరాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఎంతమంది చేరారని, వారిని ఎలా నియమించుకున్నారని వంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ప్రభుత్వం విశ్వవిద్యాలయ అధికారులను కోరిందన్నారు. దానికి సమాధానాలు రాసి ప్రభుత్వానికి పంపకుండా గత మూడు నెలలనుంచి యూనివర్సిటీ ఉన్నతాధికారులు వారి దగ్గరే ఉంచుకోవడం శోచనీయమన్నారు. ఈ విషయమై తాము ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్‌ను గత మంగళవారం వివరణ కోరామని, దానికి వారు రెండు రోజుల గడువు అడిగారని, డైరెక్టర్ మాటను గౌరవించి తమ నిరసనను తాత్కాలికంగా రెండు రోజులుగా ఆపామని తెలిపారు. అయితే శుక్రవారం తమకు ఉన్నతాధికారులను కలిసేందుకు అనుమతి దొరకలేదని, దీని వెనకాల ఏమి జరిగిందో తమకు కారణాలు తెలియవని, ఎనిమిదేళ్ల నుంచి ప్రతిసారీ ఇదే విధమైన పరిస్థితులు ఎదురు కావడంతో తాము తీవ్ర నిరాశకు లోనై శనివారం నుంచి యథావిధిగా తమ నిరసనను గాంధేయ మార్గంలో శాంతియుతంగా తెలియజేస్తున్నామని తెలిపారు. న్యాయంగా ఇవ్వాల్సిన జీతాలను ఇవ్వమని కోరుతూ ఈ నిరసనను చేపట్టామే కానీ విశ్వవిద్యాలయం విధులకు ఏ విధంగానూ ఆటంకం కలిగించడంలేదని చెప్పారు. తమ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్తే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందన్నారు. తమ సమస్యను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులను, విశ్వవిద్యాలయ అధికారులను కోరుతున్నామని తెలిపారు.



నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

అటవీ సంపదను తరలిస్తే కేసులు

జిల్లా అటవీ శాఖాధికారి పివి.సందీప్‌రెడ్డి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ శాఖ చెక్ పోస్ట్ గుండా అక్రమంగా అటవీ కలపను తరలించే వాహనాలపై కేసులు నమోదు చేయాలని జిల్లా అటవీ శాఖాధికారి పివి.సందీప్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శనివారం వేలేరుపాడు పర్యటనకు వెళ్తూ మార్గమధ్యలో అటవీ శాఖ చెక్‌పోస్టును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్ట్ సిబ్బంది విధుల్లో 24 గంటలు ఉంటూ అప్రమత్తంగా ఉండాలని, చెక్‌పోస్ట్ గుండా అక్రమంగా అటవీ కలపను తరలించే వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా జాతీయ రహదారి విస్తరణలో చెక్ పోస్ట్ పడటంతో మళ్లీ నూతన చెక్‌పోస్ట్ నిర్మాణానికి ఎంత స్థలం అవసరం ఉంటుందో కొలతలను పరిశీలించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి చెక్ పోస్ట్‌కు స్థలాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు సబ్ డిఎఫ్ఒ వెంకటసుబ్బయ్య, సిబ్బంది రాఘవులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో మెగా ఎక్స్‌పో -2025

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు మెగా ఎక్స్‌పో - 2025 ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌జియుకెటి ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్, నూజివీడు క్యాంపస్ పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, డీన్ (అకడమిక్స్) డాక్టర్ సాదు చిరంజీవి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవానికి కాకినాడ జెఎన్‌టియు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల ఐడియాలు కేవలం వారికి మాత్రమే కాకుండా దేశానికి ఉపయోగపడతాయని, జెఎన్‌టియు కాకినాడ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు పార్టనరుగా ఉండడానికి శ్రీ నిలీష్ కుమార్ కృషి ఎంతో ఉందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ప్రధాన సలహాదారు నిలీష్‌కుమార్ గౌరవ అతిథిగా పాల్గొని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇన్నోవేషన్‌కు బౌండరీ లేదని, నూతన ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థులు సంసిద్ధులుగా ఉండాలని చెప్పారు. ఈ మెగా ఎక్స్‌పోలో మొత్తం 38 టీమ్‌లు తమ ప్రాజెక్టులతో పాల్గొనడం విశేషం. శాస్త్రీయ పరిశోధనలు, డైలీ టెక్నాలజీకి సంబంధించిన వినూత్న ప్రాజెక్టులు, ప్రాథమిక సైన్స్ కాన్సెప్ట్ ఆధారంగా రూపొందించిన నమూనాలు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తమ ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శిస్తూ, వాటి పనితీరు, ప్రయోజనాలను స్పష్టంగా వివరించారు. సైన్స్ అంటే కేవలం సిద్ధాంతం కాదని, అది మన జీవితాన్ని మార్చే శక్తి అని ఈ మెగా ఎక్స్‌పో మరోసారి రుజువు చేసింది. నూజివీడు ఆర్‌కె వ్యాలీ ఐఐఐటిలకు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, కో-ఆర్డినేటర్లు బండి ప్రసాద్, కొండారెడ్డి ఈ కార్యక్రమ ప్రత్యేకతను వివరించారు. వీరితో పాటు నాగార్జున యూనివర్శిటీ భౌతిక శాస్త్ర ఆచార్యులు రవికుమార్, సంధ్యా కోల్, లోకల్ గ్లోబ్ సొల్యూషన్స్ సిఇఒ మధు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నూతన ఆవిష్కరణలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఐటిడిఎ డిడి జగన్నాధరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ డిడి జగన్నాధరావు ఆదేశించారు. బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహ పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహంలో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం వసతి గృహంలో నిద్ర చేసి ఉదయం ఐటిడిఎ బయలుదేరి వెళ్లారు.

పాఠశాలల్లో విద్యామృతం అమలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల మంత్రి కొలుసు పార్థసారథి సొంత నిధులతో విద్యామృతం పథకాన్ని ప్రారంభించారు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటలకు విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నట్లు నాయకులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని తల్లిదండ్రుల సత్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పెదబాబు, జగన్మోహనరావు, శేషయ్య, పలి పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పద్మ కిషోర్, గుడిమెళ్ల రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా వ్యాపారం మానివేసిన వారి కొన్ని కుటుంబాల్లో చదువుకునే ఏడుగురు విద్యార్థినులకు ఎక్సైజ్ అధికారులు శనివారం సైకిళ్లు అందించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన తాతా రాంబాబు వద్ద నుంచి ఎనిమిది డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ అశోక్ తెలిపారు. అనంతరం నవోదయం 2.0 మార్పు కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డిగూడెం గ్రామంలో నాటుసారా వ్యాపారం మానివేసిన వారి కొన్ని కుటుంబాల్లో చదువుకునే ఏడుగురు విద్యార్థినులకు ప్రోత్సాహకంగా జి.పాండురంగారావు, అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొత్త సైకిళ్లు అందించారు.

ఆటల పోటీల్లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

భీమవరం జిల్లా తణుకు భాష్యం ఒలింపస్ మెయిన్ బ్రాంచ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో చింతలపూడి భాష్యం స్కూల్ బాలికలు ప్రతిభ కనపరిచారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో గెలిచి ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, ఛాంప్స్ ప్రిన్సిపల్ ఎం.రమాదేవి పిఇటి గంగాధర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు మన అతిథులని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఉత్సవ కమిటీ ఛైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ అధికారులకు సూచించారు. పట్టిసీమ ఫెర్రీవద్దలో శనివారం నిర్వహించిన పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల పై సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఈ ఉత్సవాలను జరిపించగలమని తెలిపారు. డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరావు మాట్లాడుతూ పట్టిసీమ పుణ్యక్షేత్రానికి విద్యుత్ కాంతులు తక్కువవుతున్నాయని, అలా జరుగకుండా ఆలయం అంతా కనపడేలా విద్యుత్ అలంకరణ చేయాలని దేవస్థాన అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సాయిరాజు, ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, సిఐ బాలసురేష్‌బాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి సిహెచ్.వెంకట లక్ష్మి, డిఇఓలు సుబ్రహ్మణ్యం, ఎస్ఐ పవన్‌కుమార్, సర్పంచి సబ్బారపు శ్రీరామమూర్తి, పంచాయతీ కార్యదర్శి రాజారావు, హుకుంపేట జమిందార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న పోతర్లంక ఏసుబాబు(55) అనారోగ్యంతో విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం పరిస్థితి విషమించి మరణించారు. మండల పరిధిలోని పోతవరప్పాడు గ్రామానికి చెందిన ఏసుబాబుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పేద దళిత కుటుంబానికి చెందిన హోంగార్డ్ మృతితో పోతవరప్పాడు గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. హోంగార్డుగా మండల పరిధిలో పలువురికి సుపరిచితులైన ఏసుబాబు మృతి పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేయడంతో పాటు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత మెరుగ్గా అందించడంతో పాటు వారికి ఆపద సమయంలో సైతం కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఆపదలో ఆపన్న హస్తం అందిస్తూ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పెదపాడు మండలంలోని కొత్తూరు, పెదపాడు, వట్లూరు, పునుకొల్లు, పెదపాడు గ్రామాలకు చెందిన 12 మందికి సిఎం సహాయనిధి నుండి మంజూరైన దాదాపు రూ.ఎనిమిది లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కూటమి నాయకులతో కలిసి అందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కలిదిండి : బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శి, విఆర్ఒ, ఎంఎస్‌కె, అంగన్వాడీ టీచర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులదేనన్నారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎంఇఒ-2 శ్రీనివాస్ మాట్లాడారు. సిడిపిఒ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శ్యామల గౌరి, సుందరమ్మ, జయలక్ష్మి, ఎపిఎం సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, విఆర్ఓలు, ఎంఎస్‌కెలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

బైక్ అదుపుతప్పి కింద పడటంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మల్లుకుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన వంకాయలపాటి హరీష్ (26) ఈ నెల 26వ తేదీన తన స్నేహితుడితో కలిసి బైక్‌పై టి.నరసాపురం మండలం బొర్రంపాలెం గ్రామంలో ఓ శుభ కార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని మల్లుకుంట గ్రామ శివారు మలుపు వద్దకు వచ్చేసరికి బైక్ తప్పి పడిపోవడంతో హరీష్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే హరీష్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని తల్లి రత్నం ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

21 ఎకరాల గడ్డివామి దగ్ధం

ఉంగుటూరు : ఉంగుటూరు మండల శివారు గోపాలపురంలో నలుగురు రైతులకు చెందిన వివిధ చోట్ల ఉన్న 21 ఎకరాల ఎండి గడ్డి కట్టల వామిలకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నిప్పు పెట్టారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఐదు ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించి సామగ్రి కూడా ఈ మంటల్లో దగ్ధమైంది. ఒక పాడి గేదెకు గాయాలయ్యాయని రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాద కారణాలు తెలియాల్సి ఉంది. ఎవరో కావాలనే నిప్పు అంటించారని బాధిత రైతులు వంకిన వీర్రాజు, వంకిన సత్యనారాయణ, బిక్కిన శ్రీను, బిక్కిన శ్రీనివాసులు వాపోతున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాత గొడవల నేపథ్యంలో నిప్పు పెట్టినట్టు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఎంఎల్ఎ సోదరుడు భీమరాజు పరిశీలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

చిందిన రక్తం.. ఎవరిది వైఫల్యం..!

రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. దేశ భవిష్యత్తుకు చోదకశక్తులైన యువత ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రైతే దేశానికి వెన్నెముక అని గొప్పలు చెప్పుకునే దేశంలో తాము చెమటోడ్చి పండించిన పంటను అధికారులు ధ్వంసం చేస్తుంటే ఇదేమిటని అడిగినందుకు రక్తమొచ్చేటట్లు కొట్టడంతోపాటు బాధితులపైనే కేసులు పెట్టడం మన పాలకులకే చెల్లింది. ఈ రెండు ఘటనలకు మూలం చట్టాల వైఫల్యమా.. లేక పాలకుల వైఫల్యమా.. ఎవరిది వైఫల్యం అనే అంశం రెండు జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది.

రెండు జిల్లాల్లో ఈ కాలంలో చోటుచేసుకున్న వరుస రోడ్డు ప్రమాదాల్లో సుమారు పది మందికిపైగా మృత్యువాతపడ్డారు. వీరిలో యువత ఎక్కువగా ఉండటం ఆందోళన కల్గించే అంశం. పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుమంట్ర మండలం పొలమూరులో ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందడం అందరినీ కలిచివేసింది. యువకులు మోటారు సైకిల్‌పై బయల్దేరి అర కిలోమీటరు దూరం ప్రయాణించగానే ప్రమాదానికి గురవ్వడంపై అసలు ప్రమాదానికి కారణాలేమిటనే దానిపై కలెక్టర్ నాగరాణి ఒక కమిటీని సైతం నియమించారు. అయితే ఇది రోడ్డు డిజైన్ వరకే పరిశీలించి నివేదిక ఇస్తే ప్రమాదానికి కారణాలు పూర్తిస్థాయిలో వెల్లడయ్యే అవకాశం లేదనే వాదన విన్పిస్తోంది. గ్రామంలో రోడ్డు ఇరుకుగా ఉండటం సమస్యగానే ఉందని, తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. గ్రామంలో వాహనాల వేగం నియంత్రణకు స్పీడ్‌బ్రేకర్లు లేదా రబ్బింగ్ స్ట్రిప్స్‌గాని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఇక ఇదే గ్రామశివార్లలో కొన్ని నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన యువకుడు గల్ఫ్ నుంచి కుమారుని పుట్టినరోజు వేడుకకు వచ్చి, సొంత పనిపై భీమవరం వెళ్తొస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదాలన్నింటికీ వాహనాల అతివేగమే కారణమని స్పష్టమవుతోంది. దీనిపై కమిటీ ఏం నివేదిక ఇస్తుందో వేచిచూడాలి. అలాగే మద్యం మత్తు కూడా ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. పట్టణాలు ఎలాగున్నా మండల కేంద్రాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు రాత్రి 11 గంటల వరకే తెరిచి ఉంచాల్సినప్పటికీ ప్రధాన షట్టర్లు మూసినా, వెనుక మార్గం నుంచి రాత్రి 12, ఒంటి గంట వరకూ విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో యువత మద్యం సేవించడంతోపాటు ఇష్టంతో కొనుక్కున్న స్పోర్ట్స్ బైక్‌లపై మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వీటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపైనా అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. ఇదే క్రమంలో శనివారం తెల్లవారుజామున భీమడోలు మండలం సూరప్పగూడెం ఫ్లయ్ ఓవర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ముగ్గురు యువకులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఫ్లవర్ డెకరేషన్ పని చేసే ముగ్గురు యువకులు తెల్లవారుజామునే ఏలూరు వచ్చి పూలు కొనుగోలు చేసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు అంచనా. కలిదిండి మండలం సున్నంపూడి వద్ద బొలేరో బోల్తా పడి చేపల పట్టుబడికి వెళ్లిన తండ్రీకొడుకులు, మరొకరు మృత్యువాత పడ్డారు. వరుస ప్రమాదాలు రెండు జిల్లాల ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒకపక్క రోడ్లు అధ్వానం వల్ల ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతుండగా, రోడ్లు బాగున్న కొద్దిపాటి ప్రాంతాల్లో నిబంధనలు పాటించక, మద్యం మత్తు తదితర కారణాల రీత్యా ప్రమాదాలు చోటుచేసుకుని యువత ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా ఈ ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలపై రెండు జిల్లాల ఉన్నతాధికారులు దృష్టిసారించడంతోపాటు క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. లేనిపక్షంలో రోడ్లు రక్త మోడడానికి బాధ్యత పాలకులే వహించాల్సి ఉంటుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.



ఇక ఏజెన్సీలోని బుట్టాయగూడెం మండలం ఇనుమూరులో 30 ఏళ్లుగా గిరిజనుల సాగులో ఉన్న భూముల్లోకి ప్రొటెక్షన్ ఆర్డర్ పేరిట రెవెన్యూ, పోలీసు అధికారులు వెళ్లి మొక్కజొన్న పంటను ధ్వంసం చేయడం మనం ప్రజాస్వామిక దేశంలో ఉన్నామా, లేక నియంతృత్వ పాలనలో ఉన్నామా అనే సందేహం కలుగుతోంది. వాస్తవానికి ఈ భూమి ప్రభుత్వ భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టంగా ఉంది. మధ్యలో ఆన్‌లైన్‌లో గిరిజనేతర భూస్వామి తన పేరు నమోదు చేయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే సదరు భూస్వామి ఎన్నడూ ఆ భూమిలో సాగు చేసిందీ లేదు. దీనిపై ప్రస్తుతం కోర్టులో కేసు కూడా ఉంది. ఒకవేళ రైతు ఆర్‌డిఒ నుంచి ప్రొటెక్షన్ ఆర్డర్ పొందితే అదే విషయం గిరిజనులకు సామరస్యంగా తెలియజేయడం, భూమిని తమ స్వాధీనంలోకి తీసుకుంటూ బోర్డు పెట్టడం మైదాన ప్రాంతంలో సర్వసాధారణంగా జరిగే ప్రక్రియ. అయితే ఏజెన్సీలో మాత్రం గిరిజనేతర భూస్వాముల కాసులకు కక్కుర్తిపడుతున్న అధికారులు వారు చెప్పినట్లే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కజొన్న పంటను ట్రాక్టర్లతో తొక్కిస్తుంటే ఏ రైతుకైనా బాధ కలగక మానదు. ఇదేమిటని ప్రశ్నిస్తే దుర్భాషలాడటం, అడ్డుకునే ప్రయత్నం చేస్తే మహిళలని చూడకుండా మగ పోలీసులచే దాడి చేయించడం, అమాయక గిరిజనులను రక్తమొచ్చేటట్లు కొట్టడం ఇవన్నీ ఎంతవరకూ న్యాయమని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. పైగా బాధితులైన గిరిజనులనే నేరస్తులుగా చిత్రీకరిస్తూ కేసులు నమోదు చేయడం వెనుక ఎవరి హస్తం ఉందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. ఒక యువకుని సర్టిఫికెట్ మంజూరు విషయంలో తాత్సారం చేయడంపై ఇదే తహశీల్దార్ తీరుపై గతంలో ఎంఎల్ఎ బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. గిరిజనులన్నా, గిరిజన చట్టాలన్నా చులకనగా చూసే అధికారులను ఏజెన్సీ ప్రాంతానికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికీ ఏం జరిగిందని బాధిత గిరిజనులను గిరిజన ఎంఎల్ఎ కనీసం పరామర్శించకపోవడం కూటమి ప్రభుత్వ అండతోనే ఏజెన్సీలో అధికారులు చట్టవిరుద్ధంగా ముందుకెళ్తున్నారని స్పష్టమవుతోంది. అయితే పాలకులు తీరెలా ఉన్నా చట్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిన అధికారులు మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరించడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని పరిశీలకులు సైతం హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కార్యాలయాల్లో కూర్చుని గిరిజనుల సంక్షేమం గురించి సమీక్షలు చేయడం వరకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని, దానికి విరుద్ధంగా ముందుకెళ్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. లేనిపక్షంలో గిరిజనులను రక్తమొచ్చేటట్లు కొట్టడం వెనుక చట్టాల వైఫల్యమా, లేక ప్రభుత్వం, ఉన్నతాధికారుల వైఫల్యమా అనే చర్చ మరింత విస్తృతస్థాయిలో సాగి బాధితులంతా ఉద్యమబాట పట్టే అవకాశం ఉంది.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

పిఎంపిల సేవలు శ్లాఘనీయం

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అత్యవసర సమయంలో పిఎంపిలు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని మాజీ ఎంఎల్‌సి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు టిడి జనార్దన్ అన్నారు. శనివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) 63వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం హాస్పిటల్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ ప్రధాన కార్యదర్శి వివిటి.రాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆశ్రం హాస్పిటల్స్ డైరెక్టర్ రతీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టిడి జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆశ్రం హాస్పిటల్ డైరెక్టర్ రతీదేవి, ఆశ్రం హాస్పిటల్ సిఇఒ కె.హనుమంతరావు, ఎపిఆర్ జెఎసి న్యాయ సలహాదారు డాక్టర్ ఎన్ఎల్.రావు, టిడిపి జిల్లా పార్లమెంట్ యువ నాయకులు పి.హర్ష మాట్లాడారు. అనంతరం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.

శిస్తు వసూళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

శిస్తు వసూళ్లు విఆర్ఒలు వేగవంతం చేయాలని తహశీల్దార్ షేక్ లతీఫ్ పాషా అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో శనివారం విఆర్ఒల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లతీఫ్ పాషా మాట్లాడుతూ మండలంలో పేరుకుపోయిన నీటి తీరువా శిస్తూ వసూళ్లు వేగవంతంగా చేసి విఆర్ఒలకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. శిస్తూ వసూళ్ల విషయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే తనను సంప్రదించాలన్నారు. తాను వెంటనే ఆ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. విఆర్ ఒలకు నిర్దేశించిన శిస్తూ వసూళ్ల లక్ష్యాలను అధిగమించని వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడ బోమన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ జానకి జయరాం, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

కన్వీనర్ కోటాలో ప్రసాద్‌కు మెడికల్ సీటు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కన్వీనర్ కోటాలో మెడికల్ సీటు సాధించడం ఎంతో అభినందనీయమని మాజీ ఎంఇఒ జి.సూర్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని సగ్గూరు గ్రామానికి చెందిన ఈడ్పుగంటి జోజిబాబు, పద్మ కుమారుడు ఈడ్పుగంటి ప్రసాద్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ కాలేజీలో మెడికల్ సీటు సాధించారు. సగ్గూరు ఎంపియుపి పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో యు.ప్రభాకరరావు, ఇ.రంగారావు, యు.సాల్మన్‌రాజు, కె.శ్రీనివాసరావు, వైద్యాధికారులు మంజుల, సంధ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఉపాధ్యాయులు సురేష్, పలువురు గ్రామస్తులు ప్రసాద్‌ను అభినందించారు.

ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డే

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలోని కృష్ణవరంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఉషాకుమారి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి వ్యవసాయాధికారి జె.భవాని, గ్రామ వ్యవసాయ సహాయకులు శివాజీ, పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ కొండిశెట్టి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల ఏర్పాటుపై గ్రామసభ

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రగడవరం మేజర్ పంచాయతీని మూడు పంచాయతీలుగా చేయాలని కోరుతూ ఎంపిడిఒ కామేశ్వరి ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ, గ్రామ పునర్విభజన నిర్వహించారు. ప్రగడవరం పంచాయతీ వెలగలపల్లి, ప్రగడవరం, పోనుకుమాడు గ్రామాలను మూడు పంచాయతీలుగా చేయాలనే ప్రణాళికను గ్రామస్తుల ముందు ఉంచారు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే, తమ అభిప్రాయలను రాత పూర్వకంగా అందించాలని ఎంపిడిఒ కోరారు. గ్రామస్తుల అభిప్రాయలను ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు తెలిపారు. ఫాతిమాపురం, ప్రగడవరం ఎస్‌సి రెండు గ్రామాలు కలిపి ఒక పంచాయతీ చేయాలని, శంకుచక్రపురాన్ని కూడా పంచాయతీ చేయాలని సర్పంచి భూపతి, కొంతమంది గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమానికి మండల అధికారులు సచివాలయం సిబ్బందితో పాటు 14 గ్రామాల వాసులు పాల్గొన్నారు.

తామర పురుగు ఉధృతిని నివారించాలి

మిర్చి రైతులకు మండల ఉద్యానవన శాఖాధికారి సూచన

ప్రజాశక్తి - ముసునూరు

మిర్చిపంటలో నల్లి పురుగు, తామర పురుగు ఉధృతంగా ఉండటంతో రైతులు పెట్టుబడులు ఎక్కువ అవ్వడంతో పాటు, పంట నష్టశాతం కూడా పెరగటం, మొక్క పెరగకపోవడం వంటివి ఇబ్బందులు ఎదుర్కొగా ఈ విషయం తెలుసుకున్న మండల ఉద్యానవన శాఖాధికారి ఆర్.హేమ మండలంలోని వలసపల్లి గ్రామంలో మిర్చి పంట తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లి, తామర పురుగు ఉధృతి పెరగకుండా ఉండటానికి ఇమిడో క్లోరోఫైడ్ క్రిమిసంహారక ముందు పంటపై పిచికారీ చేయాలని, అలాగే ఎకరానికి 10 నుంచి 15 పసుపు, నీలం రంగు అట్టలు పంట చేలో పెట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర, గ్రామ సర్పంచి చలసాని దామోదరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా వీర్ బాల దివస్

ప్రజాశక్తి - ముసునూరు

భారతదేశ చరిత్రలో త్యాగం, ధైర్యం, దేశభక్తి పెంపొందించడానికి, చిన్న వయసులోనే బలిదానం పొందిన గురు గోవింద్ సింగ్ కుమారులు సాహిబ్ జాద జొరవరసింగ్, సాహిబ్జాదా ఫతేసింగ్ నేటి విద్యార్థులకు ఆదర్శనీయమని మండలంలోని మద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు అన్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన వీర బాల దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతదేశ వ్యాప్తంగా ధైర్య సాహసాలను ప్రదర్శించిన చిన్నారులకు ఢిల్లీలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డులు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో, కళాశాలలో, అంగన్వాడీ కేంద్రాల్లో వాడవాడలా వీరి ధైర్యాన్ని, ప్రాణ త్యాగాలను, గుర్తు చేసుకుంటూ వ్యాసరచన, చిత్రలేఖన, పోస్టర్ మేకింగ్ తదితర అంశాలు నిర్వహించుకోవటం ఆదర్శనీయమన్నారు.

దెబ్బతిన్న రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలో రహదారులను గుంతలు లేకుండా తీర్చిదిద్దుతామని సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న పలు రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేసిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపూడి- కామవరపుకోట మధ్య రహదారిలో పాడైన చోట్ల 5.9 కిలోమీటర్ల మేర, పొంగుటూరు- లక్కవరం మధ్య 4.4 కిలోమీటర్లు, కోడూరు- చౌటుపల్లి మధ్య 5.6 కిలోమీటర్లు, నూజివీడు, రావిచర్ల మధ్య 4.95 కిలోమీటర్లు, నిడమర్రు-చిననింద్రకొలను మధ్య 1.6 కిలోమీటర్, ధర్మాజీగూడెం- జీలకర్రగూడెం, రంగాపురం- తడికలపూడి రోడ్లు 18.55 కిలోమీటర్, దాకారం 4.09 కిలోమీటర్, జంగంగూడెం - ముసునూరు మధ్య 1.20 కిలోమీటర్ల మేర రహదారులను పునర్నిర్మించనున్నారని తెలిపారు. రాష్ట్ర రహదారుల్లో ఏలూరు- జంగారెడ్డిగూడెం మధ్య బాగా దెబ్బతిన్న 5.79 కిలోమీటర్లు, మేడిశెట్టివారిపాలెం - ఏలూరు రోడ్డు మధ్య పాడైన 7.6 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించనున్నారని తెలిపారు.

బోర్వంచలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండల పరిధిలోని బోర్వంచ గ్రామంలో ఆర్‌జియుకెటి ఎన్ఎస్ఎస్ యూనిట్-1 స్పెషల్ క్యాంపును ప్రోగ్రాం ఆఫీసర్ బి.లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి కుంటం ఉదయ్ రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రత్తిపాటి శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పివి.లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామసచివాలయంలో మొక్కలు నాటి, పరిసరాలను శుభ్ర పరిచి, గ్రామస్తులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం అనంతరం గ్రామంలో సర్వే కార్యక్రమం చేపట్టి, స్థానికుల సమస్యలు, అవసరాలను గుర్తించి నమోదు చేయడం ద్వారా గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో రావిచర్ల గ్రామంలో ప్రత్యేక శిబిరం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ సచివాలయంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎఇ లక్ష్మణరావు, ప్రోగ్రాం ఆఫీసర్ సత్యదేవ్, గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మణరావు, పంచాయతీ సెక్రటరీ అశోక్, ఫీల్డ్ టెక్నికల్ కో-ఆర్డినేటర్ శ్యామలరావు, విఆర్ఒ చందు, తదితర గ్రామాధికారులు హాజరయ్యారు. వారు తమ ప్రసంగాల్లో ఎన్ఎస్ఎస్ సేవా భావన ప్రాధాన్యతను, యువత సమాజం పట్ల తీసుకోవాల్సిన బాధ్యతను వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రావిచర్ల జెడ్‌పి హైస్కూల్‌ను సందర్శించి, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘం ఎన్నికలు శనివారం ఏలూరులో నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు విజిఎంఆర్.కృష్ణారావు, మాజీ అధ్యక్షులు పగడం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా వైయుఎం.సూర్యకుమార్, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా డి.శ్రీనివాస్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంఎస్ఇజిఎన్‌వి.వెంకట్రావు, కెవిఎల్.తనూజ, ఎన్.మణికుమారి, జనరల్ సెక్రటరీ బిహెచ్.కృష్ణంరాజు, కోశాధికారి పి.ధర్మగోవిందు, జాయింట్ సెక్రటరీ నేతల విజయకుమార్ (నారాయణపురం పంచాయతీ అభివ ద్ధి అధికారి), ఆర్.కుమార్, సెక్రటరీలు ఆర్.సాయికృష్ణ, పి.రవీంద్రబాబు, ప్రచార కార్యదర్శులుగా ఐ.గౌతమిదుర్గ, వి.వెంకటధర్మారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య

నిందితుడు అరెస్టు

గుర్తు తెలీని మహిళ మృతి కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని మర్లగూడెం అటవీ ప్రాంతంలో గుర్తు తెలీని మహిళ మృతి చెంది ఉన్న కేసును పోలీసులు 48 గంటల్లో కేసులో ఛేదించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే మహిళ వ్యక్తి చేతిలో హత్యకు గురైనట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు వెల్లడించారు. మండలంలోని మర్లగూడెం అటవీ ప్రాంతంలో ఇటీవల మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు పోలవరం డిఎస్‌పి పర్యవేక్షణలో జీలుగుమిల్లి సిఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మహిళ హత్యకు గురైనట్లు గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కొయ్యలగూడెం మండలం రామానుజపురం గ్రామానికి చెందిన ఎడ్లపల్లి గణేష్‌కు, సరిపల్లి గ్రామానికి చెందిన పామర్తి శిల్పారాణికి వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో గణేష్ భార్యకు విషయం తెలియడంతో వివాహేతర సంబంధం మానుకోవాలని గణేష్‌కు చెప్పింది. దీంతో గణేష్ శిల్పారాణికి విషయం చెప్పడంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. దీంతో గణేష్ శిల్పారాణిని మండలంలోని మర్లగూడెం అటవీప్రాంతంలోకి తీసుకెళ్లి కర్రతో తలపై కొట్టి హత్య చేశాడు. నేరం అంగీకరించిన గణేష్‌ను న్యాయస్థానంలో అప్పగిస్తామని జీలుగుమిల్లి సిఐ తెలిపారు.

ముదినేపల్లి మండలాన్ని 'కృష్ణా'లో విలీనం చేయాలి

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండలాన్ని కృష్ణా కజిల్లాలో విలీనం చేయాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి సిఎం చంద్రబాబునాయుడుకు శనివారం రాసిన లేఖలో పేర్కొన్నారు. ముదినేపల్లి మండలాన్ని గత ప్రభుత్వం ఏలూరు జిల్లాలో విలీనం చేశారని, నాటి నుంచి కృష్ణా జిల్లాకు దగ్గరగా, ఏలూరు జిల్లాకు దూరంగా ముదినేపల్లి మండలం ఉన్నందున, ప్రజలకు అధికారులతో అవసరం వచ్చినా ముదినేపల్లి మండల ప్రజలు ఏలూరు వెళ్లటానికి రహదారుల మార్గం దూరమై చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు, ఆక్వా రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. త్వరితగతిన ముదినేపల్లి మండలాన్ని మళ్లీ కృష్ణా జిల్లాలో కలపటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గతంలో మంత్రి నారాయణకు వివరించామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సిఎం చంద్రబాబు కూడా స్పందించి ముదినేపల్లి మండలాన్ని కృష్ణా జిల్లాలో విలీనం చేయాలని కోరారు.

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి కం మొబైల్ కోర్టు, ఏలూరు

E.P.No.12/2025 in O.S.No.81/2023

బిట్వీన్:

పైరు రామాంజనేయులు ...డిక్రీ హోల్డర్

AND

సత్రపు వెంకట స్వర్ణలత ...జె.డి.ఆర్

భర్త: దుర్గారావు, డో.నెం.20ఇ-4-54, సబ్బుల వారి వీధి, కొత్తపేట, 40వ డివిజన్, ఏలూరు.

పై నెంబరు ఇ.పి.లో మీయొక్క హాజరు నిమిత్తం పై కోర్టు వారు **ది.09-01-2026వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు వాయిదా వేసినారు.** కావున మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరు అయ్యి ఇ.పి. మీ పరోక్షమున విచారించబడునని తెలుసుకొనగలరు.

B.V.APPA RAO
B.KUMAR
Advocates, Eluru-1.
Cell: 94401 88346

ఏలూరు,
25-12-2025.

CHANGE OF NAME

I, Velamati Nagendra Bhupati Babu S/o. Velamati Venkata Subbarao residing at H.No: 24A-13-8, Kandukuri Viresalingam Street, Ashoknagar, Eluru, Eluru District, A.P. Pin-534002. I have changed my name from Velamati Nagendra Bhupathi (Old Name) to **Velamati Nagendra Bhupati Babu (New Name)**, hence forth I am being called as **Velamati Nagendra Bhupati Babu (New Name)** for all purposes

In The Court Of The Hon'ble 1st Addl. Civil Judge (Junior Division) : Eluru

F.D.I.A.No.47/2024 in O.S.No.313/2019

Between:

Smt.Eggirothu Lakshmi ...*Petitioner /Plaintiff*

AND

Smt.Bethina Rama Devi ...*Respondent /Defendent*

To: Bethina Rama Devi, W/o.Bethina Srinivasa Rao, R/o. New Ashok Nagar, Gavaravaram, Eluru, Eluru District.

పై నెంబరు పిటీషనులో శ్రీ కోర్టు వారు రెస్పాండెంటు వారి హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీయొక్క హాజరు నిమిత్తం **ది.09-01-2026వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు వాయిదా వేసియున్నారు.** కావున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాని ఎడల మీ పరోక్షమున పై నెంబరు పిటీషను పరిష్కరింపబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

K.BHASKARA RAO
Advocate, Eluru.
Cell: 94403 16356